యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి


యంనంపేట్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పోచారం: ప్రభుత్వ ఉద్యోగాల కోసం యువత ఎదురుచూడకుండా స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. అప్పటి వరకు ఇతరులపై ఆధారపడకుండా అందుబాటులో ఉన్న స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఎంపీ ఈటలను కలిసిన నేతలు



మేడ్చల్ రూరల్: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను గురువారం రాష్ట్ర ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో ఆయనను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భూకబ్జాదారుడిపై కేసు నమోదు

పోచారం: ఖాళీ ప్లాటును ఆక్రమించి, షెడ్డు నిర్మించిన వ్యక్తిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన మేరకు.. అన్నోజిగూడ, సూర్యనగర్ కాలనీలో రాధారం జ్యోతి స్థలాన్ని కొనుగోలు చేశారు. అయితే ప్లాట్‌లో వేణు గోపాల్ యాదవ్ అక్రమంగా షెడ్ నిర్మించాడు. దీంతో తన ప్లాట్‌ను కబ్జాచేసిన వ్యక్తిపై ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని పోచారం మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అందుకు కమిషనర్ స్పందించి షెడ్‌ను కూల్చివేస్తామని చెప్పారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేణు గోపాల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

నులిపురుగుల నివారణతో బాలల ఆరోగ్యం



కీసర: కీసర పీహెచ్‌సీ సెంటర్ పరిధిలోని పిల్లలకు నులి పురుగుల నివారణలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు కీసర మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి అన్నారు. గురువారం కీసరప్రభుత్వ ఉన్నతపాఠశాలతోపాటు, మహాత్మజ్యోతిబాపూలే పాఠశాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేసే కార్యక్రమాన్ని ఆమెప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, గోధుమకుంటలో ఎంపీటీసీసభ్యురాలు మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాణే ఇంజిన్ వాల్స్‌లో బీఆర్‌టీయూ గెలుపు



మేడ్చల్: మేడ్చల్ పారిశ్రామిక వాడలోని రానే ఇంజన్‌వాల్స్ కంపెనీలో గుర్తింపు యూనియన్ కోసం గురువారం జరిగిన ఎన్నికలలో బీఆర్‌ఎస్ అనుభంధ కార్మిక సంఘం బీఆర్‌టీయు గెలిచింది. యూనియన్ అధ్యక్షుడిగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విజయం సాధించారు. ఎన్నికలలో బీఎంఎస్, బీఆర్‌టీయూ యూనియన్‌లు తలపడగా 116మంది కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్‌టీయు 78 ఓట్లు, బీఎంఎస్‌కు 38 ఓట్లు వచ్చాయి.40 ఓట్ల మెజారిటితో రాజశేఖర్‌రెడ్డి విజయం సాధించారు.

కేంద్ర మంత్రులను సత్కరించిన బీజేపీ నాయకులు


మంత్రి కిషన్‌రెడ్డి ని సత్కరిస్తున్న విక్రంరెడ్డి

మేడ్చల్: కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను జిల్లా బీజేపీ పార్టీ తరుపున జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి ,నాయకులు సత్కరించారు. బేగంపేట ఎయిర్‌పోర్ట్ లో కేంద్ర మంత్రులకు స్వాగతం పలికి జిల్లా బీజేపీ తరుపున ఆయన వారిని సత్కరించారు.

'నులి పురుగులతో రోగ నిరోధక శక్తి మందగిస్తుంది'

ఘట్‌కేసర్: నులి పురుగులతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి మందగిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నులి పురుగుల నివారణకు కమిషనర్ సాబేర్ అలీతో కలిసి ఔషధాన్ని గురువారం పంపిణీ చేశారు. నులి పురుగుల నివారణకు పరిశుభ్రంగా ఉండాలన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఆదర్శప్రాయుడు బీఎల్‌ఆర్

మంత్రి పొన్నం ప్రభాకర్

కుషాయిగూడ: తన నియోజకవర్గంలో మెడిసిన్ సీటు సాధించి ఫీజులు కట్టలేని పేద విద్యార్థులకు ఐదు సంవత్సరాల పాటుగా ఫీజు చెల్లించి ప్రోత్సహిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదర్శప్రాయుడని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో మెడిసిన్ సీటు సాధించిన చర్లపల్లి డివిజన్, చక్రిపురం కాలనీకి చెందిన పేద విద్యార్థి పెరపు ప్రశాంత్ చదువు కోసం బీఎల్‌ఆర్ సమకూర్చిన ఆర్థిక సాయాన్ని గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సేవాభావంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే బీఎల్‌ఆర్ సంకల్పం గొప్పదన్నారు. అనంతరం బీఎల్‌ఆర్ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్నత చదువులు చదువుకోవాలన్న ప్రతి పేద విద్యార్థికి అండగా ఉంటానన్నారు. పదవులు, రాజకీయాలతో తనకు సంబంధం లేదని కేవలం తనవంతుగా సేవ చేయాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నానన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్ తల్లిదండ్రులు నర్సింహ, దేవమని, నేతలు నేమూరి మహేష్‌గౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


వార్షికోత్సవంలో ఆలయ కమిటీ ప్రతినిధులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జునగర్‌లోని మల్లన్న ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు ధ్వజారోహణ, 7 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు మండపారాధన, కలశస్థాపన, గణపతి, రుద్ర హోమం అనంతరం సీతారామచంద్రుల క ల్యాణోత్సవం నిర్వహించారు. కార్పొరేటర్లు మేకల సునీతా రాముయాదవ్, శ్రవణ్‌కుమార్ ఆలయ కమిటీ సభ్యులు, మహిళ భక్తులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి దేవాలయ వార్షికోత్సవం..

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్.కే హౌసింగ్ కాలనీల్లోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయం 14వ చతుర్దశ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఉత్సవ దేవతామూర్తులకు అభిషేకాలు, అనంతరం అష్టలక్ష్మి సమేతా ఆదినారాయణ కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం అన్నదానం ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తులను శోభాయాత్ర చేపట్టారు. మౌలాలి కార్పొరేటర్ సునీతాయాదవ్, అష్టలక్ష్మి దేవాలయం ఆలయ కమిటీ సభ్యులు రాజిరెడ్డి, అలివేలు, సంధ్యారాణి, గుణవంతి, సుజాత, ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందరాచార్యులు పాల్గొన్నారు.

చోరీలతో జనం బెంబేలు



మేడ్చల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంటున్న దొంగతనాలు, దోపిడీలతో మేడ్చల్ ప్రజలు బెంబేలెత్తున్నారు. వరుసగా దొంగలు చోరీలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తుండటంతో ప్రజలకు కంటి మీద కునుకు కరువవుతోంది.

తాళం వేసి ఊరికి వెళితే అంతే..

మూడు నాలుగు నెలలుగా మేడ్చల్‌లో చోరీల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా దొంగల గ్యాంగ్‌లు చాలా రోజుల తర్వాత తమ పడగ విప్పి పంజా విసురుతుండటంతో ప్రజల సొమ్ముకు భద్రత లేకుండా పోతుంది. అర్ధరాత్రి సమయాల్లో చాకచక్యంగా తలుపులకు ఉన్న తాళాలను పగులగొట్టి ఇంట్లో చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. నెల రోజుల క్రితం పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, వినాయక్ నగర్ కాలనీలలో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో, దుకాణాలలో రాత్రి సమయాల్లో బంగారం నగదు దోచుకెళ్ళారు. రెండు నెలల క్రితం అత్వెల్లి పరిధిలోని రాఘవేంద్రనగర్ లో దొంగలు పట్టపగలే ఇంట్లో చొరబడి మహిళను బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు.

పోలీసులు తిరుగుతున్నా.. సీసీ కెమెరాలు పెట్టుకున్నా..

నిత్యం పోలీసులు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ విధిగా నిర్వహిస్తున్నా.. కాలనీలలో ఇళ్ళ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నా దొంగల దొంగతనాలు మాత్రం ఆగడం లేదు. పోలీసులు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ వాహనాల ద్వారా గస్తీ తిరుగుతున్నా దొంగతనాలకు బ్రేకులు పడటం లేదు. సీసీ కెమెరాల్లో దొంగతనాలు నమోదు అవుతున్నా అవి దొంగతనాల తీరును చూసుకోవడానికే పరిమితం అవుతున్నాయి.

ఉలిక్కిపడ్డ మేడ్చల్...

పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న బంగారు నగల దుకాణంలో గురువారం ఇద్దరు దొంగలు పట్టపగలే చొరబడి కత్తులతో బెదిరించి దొంగతనం చేయడంతో మేడ్చల్ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఇద్దరు దొంగలు దర్జాగా ద్విచక్ర వాహనంపై వచ్చి దుకాణం ముందే పార్క్ చేసి దుకాణంలోకి వెళ్ళి కత్తితో బెదిరించి దొంగతనం చేయడం ఆ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడం సోషల్‌మీడియాలో తిరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దొంగతనాలపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజల సొమ్మును కాపాడాలని కోరుతున్నారు.

రేపు ఉచిత యోగా శిబిరం

రామంతాపూర్: అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా యోగా టీచర్ కో- ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రముఖ యోగా థెరపిస్ట్ డాక్టర్ దొడ్ల సత్యారెడ్డి, పతంజలి యోగా సమితి కో-ఆర్డినేటర్ రామనాథం ఆధ్వర్యంలో శనివారం రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో ఉదయం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉచిత యోగా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో వివిధ వ్యాధుల నివారణకు సంబంధించిన పలు యోగాసనాలు, ఆహార నియమాలు, గృహ వైద్య చిట్కాలు వివరిస్తారని నిర్వాహకులు ప్రకటించారు. యోగా శిక్షణ శిబిరానికి డాక్టర్లు, సైంటిస్టులు, మేధావులు సామాజిక సేవకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొంటున్నారన్నారు. వివరాలకు 9246173775.

ఆలయ షెడ్డు నిర్మాణానికి విరాళం

రామంతాపూర్: గణేష్‌నగర్‌లోని శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయం ముందు షెడ్డు నిర్మాణం కోసం రాష్ట్ర జయశంకర్ సేవా సమితి చైర్మన్ కొత్తపల్లి సతీష్‌కుమార్ గురువారం రూ.లక్ష వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవార్లను ఆ రాధిస్తే దుష్టశక్తులు దూరమై అన్ని శుభాలే జరుగుతాయన్నారు. సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సదరం క్యాంప్ పరిశీలన

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గురువారం జరిగిన సదరం క్యాంప్‌ను మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంప్‌కు వచ్చిన వారికి అందుతున్న ఏర్పాట్లను సూపరింటెంటెంట్ డాక్టర్ సునీత, ఆర్‌ఎంఓ సంగీత్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా మొత్తానికి మల్కాజిగిరి ఆసుపత్రిలోనే క్యాంప్ ఉండటంతో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరామన్నారు. సదరం స్లాట్ బుకింగ్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని క్యాంప్‌కు వచ్చిన కొందరు తెలియజేశారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

బోడుప్పల్‌లో తైబజారు వేలం వాయిదా

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థలో గురువారం జరగాల్సిన తైబజారు వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ రాంలింగం వెల్లడించారు. బోడుప్పల్‌లో ఆయన మాట్లాడుతూ.. జూలై 16న 2024 సంవత్సరం నుంచి 31వ తేదీ మార్చి 2025 వరకు తైబజారు రుసుం వసూలు చేసుకునేందుకు పేపర్‌లో ప్రకటన ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 20న ఉదయం 11 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉందని, 19వ తేదీన సాయంత్రం 3 గంటలలోపు తైబజారు వేలంలో పాల్గొనే అభ్యర్థులు కమిషనర్ పేరు మీద రూ.10 వేలు డీడీ తీసి పూర్తి వివరాలతో అప్లికేషన్స్ ద్వారా సమర్పించాల్సి ఉంది. ఇద్దరు మాత్రమే తైబజారు వేలంలో పాల్గొనగా.. వారు కూడా తైబజారు వేలం నియమాలను పాటించకుండా దరఖాస్తు చేసుకున్నారన్నారు. దీంతో గురువారం జరగాల్సిన వేలాన్ని వాయిదా వేసి త్వరలో తైబజారు వేలాన్ని నిర్వహిస్తామని కమిషనర్ రాంలింగం ప్రకటించారు.

శ్మశాన వాటికల్లో సౌకర్యాల కల్పనకు కృషి


బోరు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ లో అన్ని వర్గాల శ్మశానవాటికల్లో సౌకర్యాల కల్పనకు కృషిచేస్తామని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణీతాగౌడ్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులోగల ముస్లిం శ్మశానవాటికలో మున్సిపల్ నిధులు వెచ్చించి కొత్త బోరువేసే పనులను ఆమే ప్రారంభించారు. మున్సిపల్ నిధులు, ప్రభుత్వ గ్రాంట్లతో వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ రమేష్‌గౌడ్, కోఆప్షన్ సభ్యురాలు మహిదాబేగం, మహ్మద్ ఖాజామియా పాల్గొన్నారు.

రక్తహీనత లేని సమాజానికి కృషి చేద్దాం


నులిపురుగుల నివారణ మందులు వేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

జవహర్‌నగర్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి రఘునాథ్‌స్వామి హాజరై విద్యార్థులకు నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ..చిన్నారుల్లో రక్తహీనత లేని సమాజానికి కృషి చేద్దామన్నారు. పిల్లలు ప్రతి ఒక్కరు నులిపురుగుల నివారణ మందులను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ నారాయణరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎం.సరస్వతి పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

కుత్బుల్లాపూర్: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నాయని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రెగోడ్ నగేష్ అన్నారు. విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యాశాఖకు కనీసం మంత్రి లేకపోవడం శోచనీయమని అన్నారు. పట్టించుకునే వారు లేకపోవడంతో ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యునిఫాం, స్టేషనరీల పేరుతో లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలని కోరారు. పాఠశాలల్లో అటెండర్లు, స్కావెంజర్లను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యురాలు మనీషా, మేడ్చల్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ భార్గవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాలు, ప్రజలు ఆయనను మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు, వీధిదీపాల ఏర్పాటు తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి జ్ఞానేశ్వర్ గౌడ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల తలరాతలు మార్చేది విద్యే

నిజాంపేట్: పేదల తలరాతలు మార్చేది విద్యేనని.. ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం బాచుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేటర్ కాసాని సుధాకర్, హెడ్‌మాస్టర్ రామకృష్ణ, నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

నో రిజిస్ట్రేషన్...నో నంబర్ ప్లేట్!

రిజిస్ట్రేషన్ లేకుండానే తిరుగుతున్న మున్సిపాలిటీ వాహనాలు



తూంకుంట మున్సిపాలిటీలో రిజిస్ట్రేషన్ లేకుండా తిరుగుతున్న వాహనాలు

శామీర్‌పేట్: వాహనం రోడ్డెక్కాలంటే రవాణా శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. రిజిస్ట్రేషన్ లేకుండా తిరుగుతూ పోలీసులు, ఆర్టీఏ అధికారుల కంట పడితే జరిమానా, కేసు నమోదు చేస్తారు. పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుంటే చుక్కలు చూపించే అధికారులు చెత్త సేకరణకు వినియోగించే మున్సిపల్ వాహనాలు రిజిస్ట్రేషన్ లేకుండానే ఏళ్ళ తరబడి రోడ్లపై తిరుగుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ లేని వాహనాలతో ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదనే విషయమై మున్సిపల్ అధికారులు నోరు మెదపడం లేదు.

8 వాహనాలు రిజిస్ట్రేషన్ లేకుండానే ....

తూంకుంట మున్సిపాలిటీలో ట్రాక్టర్లు 2, టాటా ఏస్ ఆటోలు 16, వైకుంఠ రథం 1, ట్యాంకర్లు 3 ఉన్నాయి. ఇందులో 8 టాటా ఏస్ (చెత్త సేకరణ) ఆటోలకు సుమారు రెండేళ్ళు గడుస్తున్నా ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించలేదు. అసలు ఆ వాహనాలకు సంబంధించిన పత్రాలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి మున్సిపాలిటీలో దాపరించింది.

అధికారులకు కనిపించవా...?

తూంకుంట మున్సిపాలిటీలోని వార్డుల్లో చెత్త సేకరణతో పాటు తాగునీటి సరఫరా, ఇతరాత్ర పనుల కోసం మున్సిపల్ వాహనాలు ఉదయం నుండి సాయంత్రం వరకు రోడ్లపైనే తిరుగుతుంటాయి. పోలీసులు తనిఖీ చేసే సమయంలో వారి ముందు నుండి వెళ్ళినా వాటికి సంబంధించి ఫిట్‌నెస్ ఉందా లేదా అనే విషయాన్ని ఇప్పటి వరకు తనిఖీ చేసిన దాఖలాలు లేవు. వాహనాల రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ ట్యాక్స్ చెల్లింపుల్లో ఆలస్యమైతే సంబంధిత శాఖ కు భారీగా జరిమానా కట్టాల్సి వస్తుంది. ఈ నగదునంతా ఎవరిపై మోపుతారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుంటే మేలని ప్రజలు కోరుతున్నారు.

ప్రగతి చక్ర పురస్కారాల ప్రదానం


పురస్కారాలు పొందిన కార్మికులు

మేడ్చల్: తమ విధి నిర్వహణలో సంస్థ విధించిన లక్ష్యాలను చేరుకున్న డ్రైవర్లకు, కండక్టర్లకు సంస్థ యాజమాన్యం ప్రగతి పురస్కారాలు అందజేసి సత్కరించింది. మేడ్చల్ ఆర్టీసీ డిపోలో మే నెలలో అత్యధిక ఇన్‌సెంటివ్ సాధించిన కండక్టర్లను, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లను, బ్రేక్ డౌన్ లేకుండా నిర్వహించిన మెకానిక్ లను, డిపో అధికారులు గుర్తించి వారికి గురువారం డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రగతి చక్ర పురస్కారాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. సమావేశంలో డీఎం సుధాకర్, అసిస్టెంట్ డీఎం రామారావు, ఏఈ స్నేహలత, సూపరింటెండెంట్ సత్యనారయణ కార్మికులు ,డిపో సిబ్బంది పాల్గొన్నారు.

వరికి మద్దతు ధర అభినందనీయం


మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: దేశ ప్రజలకు అన్నం పెట్టే అన్నదాతలు పండించే వరికి మద్దతు ప్రకటించడం అభినందనీయమ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలోని ఎంపీపీ చాంబర్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్నదాతలకు 14 రకాల పంటలకు నరేంద్ర మోదీ ప్రభుత్వం కనీస మద్దతు ప్రకటించిందన్నారు. వరికి రూ. 117 మద్దతు ధర పెంపుతో క్వింటాలు ధాన్యం మద్దతు ధర రూ. 2300లు చేరుకుందన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం


నరేంద్రమోదీచిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న నేతలు

కీసర: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వరి మద్దతు ధరను పేంచేవిధంగా నిర్ణయం తీసుకోవడం రైతులకు ఎంతో మేలు చేసే నిర్ణయమని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఈమేరకు నాగారం మున్సిపాలిటీలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రైతుల పక్షపాతిఅని పేర్కొన్నారు. కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీనేతలు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

వార్డును పరిశుభ్రంగా ఉంచాలి


చెత్తచెదారాన్ని తొలగిస్తున్న వార్డుకౌన్సిలర్ వెంకట్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డును పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వార్డుకౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఈస్ట్ గాంధినగర్‌లో రోడ్డుపక్కన వేసిన చెత్త చెదారాన్ని ఆయన కాలనీవాసులతో కలిసి తొలగించారు. ప్రతిరోజూ చెత్తను చెత్త ఆటోలో వేయాలని సూచించారు. వార్డు అధ్యక్షుడు ప్రవీణ్, సాయిబాబా, కాలనీ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తాం


గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో ప్రజలు, యువత, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే గ్రంథాలయాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీలో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ సెక్రటరీ సురేష్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ త్వరలో గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్ సుర్వీశ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి


డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదులు

ఘట్‌కేసర్: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఇన్‌స్పెక్టర్ సైదులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని హోలీ ఫేత్ హైస్కూల్‌లో డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయవలసిన బాధ్యత అందరిపై ఉందని, యువత మత్తు పదార్థాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అడ్మిన్ ఎస్సై రామునాయక్, పాఠశాల కార్యలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

అల్వాల్: అల్వాల్‌హిల్స్ శ్రీపద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. చక్రస్నానం, పుష్పయాగం, పలు ప్రత్యేక పూజలు నేత్రపర్వంగా నిర్వహించారు.